

## బీసీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ

**అనంతపురం :** డీఎస్సీ ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ పరీక్షలకు చదువుకునే విద్యార్థులకు అనంతపురం బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అనంతపురం బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఖుష్బు కొఠారి సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. టెట్ పరీక్షలో అర్హత సాధించిన వారికి ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఉమ్మడి జిల్లా పరిధిలో 200 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. టెట్ మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. జులై 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జులై 11వ తేదీ నుండి 60 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కాలంలో 75శాతం హాజరు ఉన్న వారికి స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తారు. అభ్యర్థులు వారి బయోడేటాతో పాటు టెట్ మార్కుల జాబితా, టిసి, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ, రూ.1లక్షలోపు ఆదాయ పత్రాలు, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలను జతపరచి అనంతపురం కలెక్టరేట్ పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందజేయాలి. మరిన్ని వివరాలకు నేరుగా కార్యాలయంలో గానీ, ఫోన్ నెంబరు 08554-275575 గానీ సంప్రదించవచ్చు.



# పాత విధానమే..!

**ప్రభుత్వం మారినా ఇసుక దోపిడీలో మార్పు కనిపించడం లేదు. పాత విధానం కాకుండా కొత్త విధానాన్ని తీసుకొస్తామని అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించింది. గతంలో లాగా ప్రభుత్వం అమ్మే పద్ధతి కాకుండా ఉచితంగానే అందిస్తామని కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన అక్రమాలపైనా నివేదికలివ్వాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ఈ పరిస్థితుల్లో పాత అక్రమాలు, పద్ధతులకు చెల్లుచీటి అని అందరూ భావించారు. కాని కొత్త ప్రభుత్వంలోనూ పాత పద్ధతులే కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

ఇసుక తరలింపునకు సంబంధించి కొత్త ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం ఇంకా వెలువరించలేదు. అప్పుడే కొంత మంది ప్రజాప్రతినిధుల అనుయాయులు కొత్త యంత్రాలు, టిప్పర్లను దింపేశారు. నదుల్లోని ఇసుకను తోడటం మొదలు పెట్టారు. అనంతపురం జిల్లాలో కొన్ని చోట్ల తవ్వకాలు మొదలయ్యాయి. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న ఒక నియోజకవర్గంలో రెండు యంత్రాలతో నిరంతరాయంగా తవ్వకాలు చేస్తున్నారు. కొన్ని వాహనాలను పోలీసులు పట్టుకుని స్టేషన్లకు సైతం తరలించారు. పక్క జిల్లా సరిహద్దునున్న మరో నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. ఇది చూసి అధికారులే నివ్వెరపోతున్నారు. ఇంకా పట్టుమని 15 రోజులు కూడా అధికారంలోకి రాకముందే ఈ రకంగా మొదలుపెడితే ఎలాగంటున్నారు.

- **ఇసుక తరలింపునకు రాని కొత్త విధానం**
- **పాలకులు మారినా మారని తీరు**
- **యథేచ్ఛగా కొనసాగుతున్న తవ్వకాలు**

**కొత్త విధానం వచ్చేలోపు తోడేసేందుకు సిద్ధం..**

ప్రభుత్వం ఇసుకపై కొత్త విధానాన్ని తీసుకొచ్చేలోపు అనుమతులున్నా.. లేకున్నా తమ పని తాము కానిచ్చేందుకు కొంత మంది నేతలు సిద్ధమయ్యారన్న ఆరోపణలున్నాయి. ఆ తరువాత పరిస్థితి ఏరకంగా ఉంటుందో అంతలోపే కావాల్సినంత తోడేసి సొమ్ము చేసుకుంటే సరిపోతుందన్న ఉద్దేశంతో పని మొదలు పెట్టారు. దీన్ని నిలువరించాల్సిన అధికార యంత్రాంగం ఏమి చేయాలో పాలుపోని పరిస్థితుల్లో ఉంది. ఎన్నికల సమయంలో నియమితులైన రెవెన్యూ, పోలీసు అధికారులు దీని పట్ల గట్టిగా వ్యవహరిస్తే ఎటువంటి పరిణామాలు ఎదురు చూడాల్సి వస్తుందోనని భయపడిపోతున్నారు. జిల్లాలో ప్రధానంగా పెన్నా నది పరివాహక ప్రాంతమే ఎక్కువగా ఉంది. ఈ నదిలోనే అనేక చోట్ల యంత్రాలను ఏర్పాటు చేసుకుని టిప్పర్లు, లారీల్లో రోజుకు పదుల సంఖ్యలో వాహనాలు తరలిపోతున్నాయన్న ఆరోపణలున్నాయి. జిల్లాలోని ప్రధాన పట్టణాలతోపాటు పక్క రాష్ట్రానికి తరలిపోతోంది. కొన్ని చోట్ల మాత్రం పట్టుబడి సమస్య లేకుండా ఉండేందుకు ముందుగానే ప్రభుత్వ పనుల నిమిత్తం అనుమతులు తీసుకున్నట్టుగా అధికారులతో ఉత్తరాలు తీసుకుని మరీ తరలిస్తుండటం గమనార్హం. ఈ రకంగా చాలా చోట్ల యథేచ్ఛగా ఈ వ్యవహారం నడుస్తున్నా అధికార యంత్రాంగం మిన్నకుండిపోతోంది. ఈ రకంగా సహజ వనరుల దోపిడీ పాలకులు మారినా తీరు మారలేదంటూ సామాన్యులు వాపోతున్నారు.

### మాటల ప్రభుత్వం కాదు

**మంత్రి పయ్యావుల కేశవ్**



**అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణం పాతపేటలో లబ్ధిదారురాలికి పింఛను అందిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్ కలెక్టర్ వినోద్‌కుమార్**

టిడిపి మాటల ప్రభుత్వం కాదు... చేతల ప్రభుత్వం. పండగలాంటి వాతావరణంలో ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం. వాడవాడలా సమాజ హితం కోరే నాయకులు, అధికార యంత్రాంగం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయినప్పుడు జరిగిన నష్టం కన్నా గత ఐదేళ్లలో జరిగిన నష్టం చాలా ఎక్కువ. క్లిష్ట పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన నారా చంద్రబాబునాయుడు ఆర్థిక రంగం ఏ పరిస్థితుల్లో ఉందనే అంచనా వేసే ప్రయత్నం చేస్తున్నారు. అన్నింటినీ చక్కదిద్ది రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లి, ప్రజల మనసుల్లో చిరకాలం నిలిచేలా తమ ప్రభుత్వం పని చేస్తుంది.

### రాష్ట్రంలో సంక్షేమ పండుగ

**మంత్రి సవితమ్మ**



**శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్లలో పింఛన్ అందించి లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి సవితమ్మ**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సంక్షేమ పండుగ ప్రారంభం అయ్యింది. అందులో భాగంగానే రూ.3వేల పింఛన్‌ను రూ.4వేలకు పెంచి 1వ తేదీ ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్ల వద్దకెళ్లి పంపిణీ చేస్తున్నాం. రాష్ట్ర అభివద్ధి ,సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని సామాజిక భద్రతపై మూడవ సంతకం చేశారు. ఈ సంతకంతో ప్రతి నిరుపేద ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా గత ప్రభుత్వం కంటే మెరుగుగా పెన్షన్లను పెంచి పేదలకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

### మాట నిలుపుకున్నాం...

**మంత్రి సత్యకుమార్ యాదవ్**



**శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం వేల్పుమడుగు గ్రామంలో పింఛన్లు అందిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్**

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.4వేలకు పెంచి మాట నిలుపుకున్నాం. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన అదనపు రూ.3వేలను కూడా లబ్ధిదారులకు అందించాం. గత ప్రభుత్వం పింఛన్‌ను రూ.2 వేల నుంచి రూ.3 వేలు చేసేందుకు 5 సంవత్సరాల సమయం తీసుకుంది. తమ ప్రభుత్వం 3 వేల రూపాయల పెన్షన్‌ను 15 రోజుల వ్యవధిలోనే రూ.4 వేలకు పెంచి లబ్ధిదారులకు అందజేశాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇకపై ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ లబ్ధిదారులకు వారి ఇంటివద్దే పింఛన్ మొత్తాన్ని అందిస్తాం. పింఛన్ పెంపుతో పేదలందరి కళ్లల్లో ఆనందం కన్పిస్తోంది.

# పెంఛన్..!

- **ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ**
- **పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు**
- **సర్వర్ సమస్యతో కాస్త ఇబ్బందులు**

**ప్రజాశక్తి-అనంతపురం**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ఉదయం ప్రారంభం అయ్యింది. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు రూ.3వేల పింఛన్‌ను రూ.4వేలకు పెంచారు. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈకార్యక్రమాన్ని ఉదయం 6 గంటల నుంచే ప్రారంభించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, టిడిపి శ్రేణులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం కొంత సేపు సర్వర్ సమస్య రావడంతో పింఛన్ల పంపిణీకి ఆటంకం ఏర్పడింది. ఆ తర్వాత యథావిధిగా పింఛన్ల పంపిణీ కొనసాగింది. మొదటి రోజు 90 శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేసినట్లు అధికారులు ప్రకటించారు.

**అనంత జిల్లాలో 2,89,508 మంది లబ్ధిదారులకు...**

అనంతపురం జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభం అయ్యింది. మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు అందరూ ఈకార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు అందించారు. ఉరవకొండ పట్టణంలోని పాతపేట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్‌లు స్వయంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఏప్రిల్, మే, జూన్ అరియర్స్ రూ.3,000, జులై నెల పింఛన్ రూ.4000 కలిపి మొత్తం రూ.7,000ను లబ్ధిదారులకు అందజేశారు. జిల్లాలో వివిధ విభాగాల పరిధిలో 2,89,508 మంది లబ్ధిదారులకు రూ.197.44 కోట్లను పింఛన్ల రూపంలో అందించినట్లు కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు.

**శ్రీసత్యసాయి జిల్లాలో 2,70,966మందికి..**

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలోని గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం కొనసాగింది. ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకెళ్లి పింఛన్లను అందించారు. జిల్లాలోని అందరూ ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రులు స్వయంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెనుకొండ నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ, ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండల పరిధిలోని వేల్పుమడుగు గ్రామంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, మడకశిర నియోజకవర్గం రొళ్ల మండల పరిధిలోని కరిదసానపల్లి, ఎం.రాయపురం, గుణేమొరుబాగల్, మొరుబాగులు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో హిందూపురం పార్లమెంటు సభ్యులు బికె.పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమాల తిప్పేస్వామి, కలెక్టర్ అరుణ్‌బాబు, సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ పాల్గొన్నారు. ఏప్రిల్, మే, జూన్ అరియర్స్ రూ.3,000, జులై నెల పింఛన్ రూ.4000 కలిపి మొత్తం రూ.7,000ను లబ్ధిదారులకు అందజేశారు. జిల్లాలో వివిధ విభాగాల పరిధిలో 2,70,966మందికి రూ.184.70 కోట్లను లబ్ధిదారులకు పింఛన్ల రూపంలో అందించినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలియజేశారు.



**పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి సవితమ్మ**

# ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా మారుద్దాం

- **డయేరియాతో ఒక్కప్రాణం కూడా పోకూడదు**
- **లోపాలను సరిచేసుకుని ముందుకెళ్దాం**
- **రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

అక్షర క్రమంలో ముందు వరుసలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్ది దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుదామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం నాడు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, వైద్య ఆరోగ్య సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి రాష్ట్రస్థాయి డయేరియా నివారణ క్యాంపెయిన్‌ను అనంతపురం కలెక్టరేట్‌లో నిర్వహించారు. రెవెన్యూ భవన్‌లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను మంత్రి సత్యకుమార్ సందర్శించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. వైద్యుల కనబడే ప్రత్యక్ష దేవుళ్లుగా ప్రజలందరూ భావిస్తారన్నారు. వైద్యరంగం నేడు కొంత మసకబారిందనడంలో అంగికరించక తప్పదన్నారు. వైద్యులుగా సమాజానికి అందే సేవలు వెలకట్టలేనిదన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ఎంతో మంది ప్రాణాలను కాపాడిన ప్రత్యక్ష దేవుళ్లు వైద్యులే అన్నారు. వైద్య రంగంలో ఉన్న లోపాలన్ని సరి చేసుకుని ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సమిష్టిగా పని చేద్దామన్నారు. ప్రస్తుతం డయేరియా వ్యాధి ప్రబలి ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇలాంటి సమయంలో దాని నివారణకు వైద్య సిబ్బంది సమిష్టిగా సమన్వయంతో సేవలు అందించాలన్నారు. డయేరియాతో ఒక్క ప్రాణం కూడా కోల్పోవడానికి వీలు లేదన్నారు. ముందస్తుగా జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ మాత్రలు విరివిగా ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు పెంపుదల చేసి మెరుగైన సేవలు అందిద్దామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ డయేరియా క్యాంపెయిలో భాగంగా జూలై 1 నుంచి ఆగస్ట్ 31వ తేదీ వరకు అతిసార నియంత్రణ మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర స్థాయి స్టాప్ డయేరియా క్యాంపెయిన్ పోస్టర్‌లను మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆవిష్కరించారు. డాక్టర్స్ డే సందర్భంగా మంత్రి కేక్ కట్ చేసి వైద్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జెడ్పీ సిఇఒ వైఖోమ్ నిదియా దేవి, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి.దేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యరావు, ఆసుపత్రి సూపరిన్‌టెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



**సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్**



**ప్రజాశక్తి డాక్టర్స్‌డే ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, అధికారులు**

## వైద్య ఆరోగ్యశాఖ ప్రక్షాళనకు కృషి

**మంత్రి సత్యకుమార్‌యాదవ్**

**ప్రజాశక్తి-అనంతపురం**

వైద్య ఆరోగ్య శాఖలో నెలకొన్న సమస్యలను ప్రక్షాళన చేసి ప్రజలకు నాణ్యమైన మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ముందుకెళ్తున్నాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రపంచ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక ఐఎంఎ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగం అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంటోందన్నారు. ఈనేపథ్యంలో అటు వైద్యులు ఇటు ప్రజలకు మధ్య వారధిగా ప్రభుత్వం న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కరోనా సమయంలో వైద్యుల సేవలు ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. వారి కుటుంబాలను ఫణంగా పెట్టి అందించిన సేవలను కొనియాడారు. అనంతరం ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన డాక్టర్స్ డే ప్రత్యేక సంచికను ఆవిష్కరించి యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ కమిషనర్ వెంకటేశ్వరరావు జిల్లా, వినోద్‌కుమార్, జెడ్పీ సీఈవో నదియా, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారెడ్డి, మాజీ అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి దేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యాలరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మనోరంజన్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, భాను, సుప్రజా, ప్రజాశక్తి సిబ్బంది రవిచంద్ర, మురళి, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.



**ఫిర్యాదులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులు**

## ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం

**జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్**

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం)లో ప్రజలు సమస్యలపై ఇచ్చే విజ్ఞప్తులకు త్వరితగతిన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, డిపిఎం ఆనంద్, ఎస్‌డిసి శిరీషతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతోకలిసి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు 344 అర్జీలను అధికారులకు అందించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని, ఈ విషయమై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ అశోక్ కుమార్, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి, అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగవిరమణ పొందిన పోలీసులకు సన్మానం

**ప్రజాశక్తి-అనంతపురం క్రైం**

ఉద్యోగ విరమణ చేసిన డీఎస్పీ, ఆరుగురు ఎస్ఐలతో కలిపి 13 మంది పోలీసులను సోమవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ గౌతమీసాలి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖలో ఎలాంటి పనిష్‌మెంట్‌లు లేకుండా పని చేయడం గొప్ప విషయమన్నారు. పదవీ విరమణ పొందాక వచ్చే పెన్షన్, తదితర ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇన్నాళ్లు పోలీసుశాఖ, ప్రజలు, పిల్లల కోసం పని చేశారని, ఇక నుంచి మీకోసం జీవించాల కోరారు. అంతేగాకుండా ఆరోగ్యం కాపాడుకుంటూ సంతోషంగా జీవించాలని ఎస్పీ ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన వారిలో డీఎస్పీ ఎం.ఆంథోనప్ప, ఎస్ఐలు రఫిక్‌సాహెబ్, బలరామరావు, తిప్పయ్యానాయక్, వెంకట లక్ష్మమ్మ, చంద్రశేఖర్, సులోచన, ఏఎస్ఐలు పద్మావతి, ఎర్రిస్వామి, దేవదాస్, మారెప్ప, ఎం.డి.దావూద్,. హెడ్ కానిస్టేబుల్ అల్లీపీరా సాహెబ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజ, ఎస్బీ సి.ఐ ఇందిర, ఆర్ఐలు రెడ్డెప్పరెడ్డి, రాముడు, ఎస్పీ సీసీ ఆంజనేయప్రసాద్, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## 4న విద్యాసంస్థల బంద్ : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి-శింగనమల**

నీట్ పరీక్ష రద్దు చేయడంతోపాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ చేయనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షులు తరిమెల గిరి తెలిపారు. ఈమేరకు బంద్‌కు సహకరించాలని కోరుతూ ఎంఇఒ నరసింహరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందన్నారు. అవకతవకలు, వ్యత్యాశాలు, బాధ్యతారాహిత్యంతో పరీక్షలు నిర్వహించారని ధ్వజమెత్తారు. నీట్ పరీక్ష లీకేజీ కుంభకోణం, నీట్-పిజి పరీక్షను 12గంటల ముందు వాయిదా వేయడం, యూజిసి నెట్ పరీక్ష రద్దు చేయడం వంటివి విద్యార్థులను తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. నీట్ స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా దేశవ్యాప్తంగా ఉన్నత విద్యతోపాటు పాఠశాల విద్య పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



**ఎంఇఒకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు**

## దానిమ్మ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం**

దానిమ్మ పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కెవికె శాస్త్రవేత్తలు రాధాకుమారి, యుగంధర్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని ఎర్రంపల్లి గ్రామ సమీపంలో సాగుచేసిన దానిమ్మ పంటను శాస్త్రవేత్తలు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దానిమ్మ పంట సాగు చేసే ముందు 4బై4 మొక్కలు నాటుకుంటే తెగులు నివారణ తగ్గుతుందన్నారు. సేంద్రియ ఎరువులు వాడకంతోపాటు రసాయనిక ఎరువులను కొద్దిపాటిగా వినియోగించాలని రైతు రమేష్‌కు సూచించారు. బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగుళ్ల అధికంగా సోకే అవకాశం ఉందన్నారు. పశువుల ఎరువు వాడకంతో పాటు పొటాష్ మెగ్నీషియం తగినంతగా వినియోగించాల్సి ఉందన్నారు. రోజూ పంటను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు తెగుళ్లను గుర్తించాలన్నారు. దశలవారీగా పంటల ఎదుగుదలను గమనిస్తూ ఎరువులను సరైన పద్ధతుల్లో వినియోగించాలని చెప్పారు. ఎప్పటికప్పుడు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని వివరించారు.



**దానిమ్మ పంటను పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు**

## 'ఉపాధి' కూలీలకు కనీస వేతనం ఇవ్వాలి

**కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప**

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు కనీస వేతనంతోపాటు పనిముట్లు ఇవ్వాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కార్యాలయంలో ఎంపిడిఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 8వారాల ఉపాధి హామీ వేతనాలు చెల్లించాలని, కూలీ కుటుంబ సభ్యులందరికి బీమా సౌకర్యం కల్పించాలని, అడిగిన వారందరికీ పనులు కల్పించాలని, రాజకీయ జోక్యం ఆపాలని, 200 రోజుల పని దినాలు కల్పించి రోజుకూలి రూ.600 ఇవ్వాలని, వంద రోజులు పనులు పూర్తి చేసిన కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో 100 రోజులు ఉపాధి కల్పించాలని, చేసిన పనులకు వారం, వారం వేతనాలు చెల్లించాలని, మేట్లకు పారితోషికం చెల్లించాలని, పనిముట్లు, సమ్మర్ ఆలవెన్సు, అదనపు వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలని, ఉపాధి హామీ పనులకు బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, ఏ నాగలింగమయ్య, దాసరి.వెంకటేశు, బి.హరికృష్ణ, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా పింఛన్ల పంపిణీ



అనంతపురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అధికారులు



ఆత్మకూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు పార్థసారథి, పరిటాల సునీత

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

అనంతపురంలో సాంఘిక భద్రత పెన్షన్ల పంపిణీ సోమవారం సాయంకాలం సమయానికి 90శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. అయితే ఉదయం నుంచి సర్వర్ డౌన్ కావడంతో పెన్షన్ పంపిణీ నత్తనడకన సాగింది. ఉదయం నుంచే సచివాలయ సిబ్బంది త్వరితగతిన పంపిణీ చేయడానికి సిద్ధమయ్యారు. సర్వర్ సమస్య కారణంగా 15 నుంచి 20 నిమిషాల సమయం పట్టిందని సచివాలయ సిబ్బంది వాపోయారు. నగరంలో ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ పాతూరులో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మేయర్ స్వరూప, ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గుంతకల్లు రూరల్ :** మండల పరిధిలోని కసాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోమవారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం కేక్ కోసి పింఛన్ పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుమ్మనూరు వెంకటేశ్వర్లు, గుమ్మనూరు నారాయణస్వామి, పత్తి హిమబిందు, జనసేన నాయకులు వాసగిరి మణికంఠ, బిజెపి నాయకులు బండారు కృష్ణమూర్తి, ఆర్‌డిఒ శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ శేషఫణి, ఎంపిడిఒ శ్రీకాంత్‌చౌదరి, పంచాయతీ కార్యదర్శి రామలింగప్ప, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు :** మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఎంపీ బి.కే.పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.

**శింగనమల :** మండల కేంద్రంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్లను అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే అందజేశారన్నారు. అలాగే పెరవలిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని టిడిపి రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌చౌదరి ప్రారంభించారు. సోదనపల్లిలో టిడిపి సీనియర్ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, చితంబరిదొర ప్రారంభించారు. ఈ కార్యక్రమంల్లో తహశీల్దార్ శోభన్‌బాబు, ఎంపిడిఒ బివి.రమణ, ఇఒఆర్‌డి మురళీకృష్ణ, ఎంఇఒ నరసింహరాజు, నాయకులు రామాంజనేయులు, చిదానందనాయుడు, డేగల కృష్ణమూర్తి, గుత్తా ఆదినారాయణ, శివారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఆదినారాయణ, శ్రీనివాసులు, శంకర, ఓబులేసు, నరేష్, సునీల్, సూరి, తిరుపాలు, అట్టే పరశురాముడు, ఎర్రస్వామి, వెంకటేష్ పాల్గొన్నారు.

**పుట్లూరు :** మండల వ్యాప్తంగా పెంచిన పింఛన్ల పంపిణీ ఘనంగా సాగింది. ఇందులో భాగంగా మండలంలోని మడుగుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పింఛన్ పంపిణీని ఎమ్మెల్యే శ్రావణిశ్రీ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎల్కే చెన్నారెడ్డి, పి.పుల్లారెడ్డి, రామునిరెడ్డి, శ్రీనాథ్‌చౌదరి, వెంకట శివారెడ్డి, బాలరంగయ్య, సుదర్శన్‌నాయుడు, రామచంద్రారెడ్డి, రవికుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయుడు, గోవర్ధన్‌రాజు, సర్పంచి శివరామయ్య పాల్గొన్నారు.

**నార్పల :** మండల పరిధిలోని బొందలవాడ గ్రామపంచాయతీలో టిడిపి జిల్లా నాయకులు వెంకట నరసానాయుడు ఆధ్వర్యంలో సోమవారం మేళతాళాల మధ్య పింఛన్ పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు పిట్టు రంగారెడ్డి, సర్పంచి నారాయణమ్మ పాల్గొన్నారు.

**కళ్యాణదుర్గం :** ప్రజాసంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. సోమవారం మండల పరిధిలోని గోళ్ల గ్రామంలో సర్పంచి కవిత బుజ్జన్నతో కలిసి పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాలతోపాటు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోరేపల్లి మల్లికార్జున, పాపంపల్లి రామాంజనేయులు, కెరడం రామ్మోహన్‌చౌదరి, లక్ష్మీనారాయణ, గోళ్ల వెంకటేశులు, వైపి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

**పామిడి :** మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ సోమవారం ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. తర్వాత చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, నాయకులు కత్రిమల ప్రభాకర్‌చౌదరి, గౌస్, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జింకల సంజీవ కుమార్, ఆర్‌ఆర్.రమేష్, బొమ్మా మోహన్, సుంకప్ప, నల్లబోతుల శ్రీనివాసులు, కుమార్, శ్రీరాములు, కొట్టం మాలిక్, తేల్ బాషా, వెంకటేష్‌చౌదరి, వెంగమనాయుడు, సూర్యనారాయణ, తిమ్మప్ప, శివ, పురుషోత్తం, ధను, బిజెపి మండల అధ్యక్షుడు అంజీనాయక్ పాల్గొన్నారు.

**గుమ్మగట్ట :** మండలంలో ప్రతి పంచాయతీలో టిడిపి యువ నాయకులు భరత్ ఆధ్వర్యంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గిరిమల్లప్ప, నాయకులు కాలవ సన్నన్న, సర్పంచి విజయలక్ష్మి, సదాశివ, రంగసముద్రం, సర్పంచి చంద్రశేఖర్, చిన్న కిష్టప్ప, శివన్న పాల్గొన్నారు.

**పెద్దపప్పూరు :** మండల వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమం సాగింది. ఇందులో భాగంగా సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవ్వతాతలకు పింఛన్లు పంపిణీ చేశారు.

**బొమ్మనహాల్ :** మండలవ్యాప్తంగా సోమవారం దాదాపు 80శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఇఒఆర్‌డి దేవదాస్ తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం నుంచే సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవ్వతాతలకు పింఛన్లు పంపిణీ చేశారు.

**రాయదుర్గం :** పట్టణంలోని కోతిగుట్ట 5వ ఎన్నికల వార్డు, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సోమవారం ప్రారంభించారు. ముందుగా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ కె.మహబూబ్‌బాషా, 3వవార్డు సభ్యురాలు కె.ప్రశాంతి, రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాళు శిల్ప, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**బుక్కరాయసముద్రం :** మండలంలోని సిద్ధరాంపురంలో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం ప్రారంభించారు. అలాగే పసలూరులో మాజీ జెడ్పీటీసీ కాటప్పగారి రామలింగారెడ్డి పింఛన్ పంపిణీ చేపట్టారు. అలాగే రేకులకుంట గ్రామ సచివాలయంలో సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి నాయకులు పసుపుల హనుమంతురెడ్డి, నాయకులు దాసరి సునీత, పసుపుల నారాయణరెడ్డి, నాయకులు అశోక్‌కుమార్, రామకృష్ణారెడ్డి, దండువారిపల్లి ఆదినారాయణ, కట్లు పెద్దన్న, రమణమూర్తి, రవి, బాల, తిరుపతయ్య, సాకే రామకృష్ణ, మాజీ సర్పంచి ఆదిశేషయ్య, మల్లికార్జున, కోటేష్, సాయివెంకటపతి, రాజు, రామాంజనేయులు, శ్రీనివాసులు ,చిన్న, ముని, నజీర్, నాగభూషణ, హేమంత్‌కుమార్, నరసింహా, చింతలయ్య, వేణు, బాలుయాదవ్, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

**పెద్దవడుగూరు :** మండలవ్యాప్తంగా పెంచిన సామాజిక భద్రతా పింఛన్లను సోమవారం టిడిపి నాయకులు, అధికారులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఒ గోపీకృష్ణ, టిడిపి నాయకులు కొండూరు కేశవరెడ్డి, అవులాంపల్లి కేశవరెడ్డి, గంగరాజు, చిన్నవడుగూరు దివాకర్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణస్వామి, హరికృష్ణారావు, తలారినారాయణస్వామి లక్ష్మీనారాయణ, రామచంద్రారెడ్డి, బాలరాజు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

**గుత్తి :** మండలవ్యాప్తంగా సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా సాగింది. ఆయా కార్యక్రమాల్లో టిడిపి నాయకులు గుమ్మనూరు నారాయణ, జి.వెంకటశివుడు యాదవ్, టి.సుధాకర్, ఎంకె. చౌదరి, నంద్యాల రమేష్, బి.వేణుగోపాల్, టి.సురేష్‌బాబు, నగదాని జయన్న, ఎన్.సత్య, సోము, రామరాజు, మోడే శ్రీనివాస్ యాదవ్, సుధాకర్, ఎ.పులికొండ, మహమ్మద్ అలీ, నారాయణస్వామి, సురేంద్రరెడ్డి, సర్పంచి బేడల లక్ష్మీదేవి, టిడిపి నాయకులు రవితేజ నారాయణస్వామి, శ్రీనివాస చౌదరి, పి.రవితేజ, కోనంకి కృష్ణ పాల్గొన్నారు.

**బెలుగుప్ప :** మండల వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమాన్ని 93.55శాతం పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ముందుగా మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఎంపిడిఒ, సచివాలయ, ఐకెపి సిబ్బంది, సెక్రటరీలు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


**అనంతపురం :** కూడేరు మండలంలో టిడిపినాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దాసరి శ్రీరాములు, నాయుడు, నరసయ్య, విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రమేష్, మానస, అంగన్వాడీ శ్యామల, తదితరులు పాల్గొన్నారు.




బుక్కరాయసముద్రం మండలంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



కళ్యాణదుర్గంలో వికలాంగునికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని




గుంతకల్లు మండలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్



కూడేరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు, అధికారులు

# డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి-వజ్రకరూరు**

డయేరియా నివారణకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, వైద్యాధికారిణి అరుణకుమారి సూచించారు. సోమవారం మండల పరిధిలోని చీకులగురికి గ్రామంలో పాల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆధ్వర్యంలో అతిసార (డయేరియా)పై గ్రామంలోని ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు, ఆహారం కలుషితం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల డయేరియా, ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**పెద్దవడుగూరు :** ప్రస్తుతం కాలానుగుణంగా వచ్చే డయేరియా, అతిసార వ్యాధులపై ప్రజలను అప్రమత్తంగా ఉండేలా ఆరోగ్య సిబ్బంది చూడాలని తహశీల్దారు శేషారామ్సింగ్, మండల విద్యాధికారి రాముడు సూచించారు. సోమవారం పెద్దవడుగూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఇందుకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు శ్రీనివాసబాబు, సూపర్వైజర్లు నాగలక్ష్మమ్మ, శ్రీనివాసులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**బెలుగుప్ప :** మండల పరిధిలోని కాలువపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అనిమిరెడ్డిపల్లి ఎంపియుపి పాఠశాలల్లో వ్యాధులపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, వైద్య సిబ్బంది సరోజా, సుబాన్, ఎర్రమ్మ, హెల్త్ అసిస్టెంట్ రవీంద్ర, వీరశేఖర్, అజయ్, ప్రధానోపాధ్యాయులు కిష్టప్ప, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



గుమ్మఘట్ట మండలంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యసిబ్బంది

## అవగాహన కార్యక్రమాల్లో వైద్యసిబ్బంది



ఉరవకొండలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది


**పెద్దపప్పూరు :** డయేరియాపై ప్రజలతోపాటు వైద్యసిబ్బంది ప్రతినిత్యం అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి సూచించారు. ఈమేరకు మండల కేంద్రంలోని ఆర్‌డిటి పాఠశాలలో డయేరియా నివారణ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులు ఎక్కువగా డయేరియా బారిన పడే అవకాశం ఉందన్నారు. కావున తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతేగాకుండా తమ ఇళ్లతోపాటు పరిసరాలను అప్రమత్తంగా ఉంచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఇఒఆర్‌డి కమలాబాయ్, సిహెచ్‌ఒ వి.భారతి, ఆరోగ్య పర్యవేక్షకులు శర్మస్‌వలి, లక్ష్మీకుమారి, రామలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నారాయణమ్మ, పంచాయతీ సెక్రటరీ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు :** మండల కేంద్రలంలోని పిహెచ్‌సిలో డయేరియా నివారణ కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అతిసార వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకవేళ ఏమైనా అనుమానం ఉంటే ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సందీప్ రాజ్‌కుమార్, తహశీల్దార్, ఎంపిడిఒ, తదితరులు పాల్గొన్నారు.

**గుమ్మఘట్ట :** మండల కేంద్రలంలోని పిహెచ్‌ఎస్‌ఐలో డయేరియా నివారణ కరపత్రాలను డాక్టర్ రమేష్ సోమవారం ప్రారంభించారు. ఈ సమావేశంలో సిహెచ్‌ఒ మురళీధర్, హెల్త్ సూపర్‌వైజర్ ఆదిబయమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ, ఎఎన్‌ఎం సువర్ణమ్మ, ఆశావర్కర్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## మెట్టు గోవిందరెడ్డి ఇంటి వద్ద అభిమానుల సందడి

**రాయదుర్గం :** మాజీ ఎమ్మెల్యే, ఏపీఐఐసీ మాజీ ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని ఆయన ఇంటి వద్ద అభిమానుల సందడి నెలకొంది. ఇందులో భాగంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాళు శిల్ప, మున్సిపల్ వార్డు సభ్యులు గోవిందరాజులు, లావణ్య, శ్రీలక్ష్మి కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, నజీర్, వైకాపా రాయదుర్గం పట్టణ సమన్వయకర్త ఆరవ శివప్ప, పార్టీ నాయకులు పోరాళు శివ, శ్రీరామిరెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యులు నాగిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మెట్టు గోవిందరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైసిపి నాయకులు




సరికొత్త హంగులతో షిరిడీ సాయి స్వీట్స్ దుకాణం

## శ్రీ షిరిడి సాయి స్వీట్స్ పున:ప్రారంభం

**ప్రజాశక్తి-అనంతపురం**

సుదీర్ఘకాలంగా స్వీట్స్ రంగంలో అపార అనుభవంతో కీర్తిపొందిన శ్రీ షిరిడీ సాయి స్వీట్స్ టవర్‌క్లాక్ వద్ద నూతన రంగులతో పున:ప్రారంభించినట్లు ఆ సంస్థ అధినేత భవాని రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా.. రోడ్డు విస్తరణ అనంతరం ప్రజలకు నచ్చే మెచ్చే అనేక అద్భుతమైన రుచులతో షిరిడీ సాయి స్వీట్స్‌ను నూతన అంగులతో టవర్ క్లాక్ వద్ద పున్నప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలు ఎప్పటిలాగా తమను ఆశీర్వదించి ఆదరించాలని కోరారు.



కార్మికుల మస్టర్లను పరిశీలిస్తున్న మేయర్ వసీం

## పారిశుధ్య కార్మికుల మస్టర్ పరిశీలన

**అనంతపురం కార్పొరేషన్ :** నగరంలోని 3వ సర్కిల్‌లో సోమవారం తెల్లవారుజామున పారిశుధ్య కార్మికుల మస్టర్‌ను మేయర్ మహమ్మద్ వసీం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. అలాగే మీ పరిధిలో పారిశుధ్య పనుల మెరుగుకు కృషి చేయాలన్నారు. మీ అందరి సహకారం కృషితోనే నగరంలో పారిశుధ్యం మెరుగు సాధ్యమవుతుందన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో మేయర్ వసీం పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ వెంకటేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజాశక్తి వార్తకు స్పందన

## బాధిత రైతులకు న్యాయం చేస్తాం

**గుంతకల్లు రూరల్ :** పవర్‌గ్రిడ్ కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని తహశీల్దార్ శేషఫణి హామీ ఇచ్చారు. ప్రజాశక్తి దినపత్రికలో 'పేద రైతులపై పవర్ గ్రిడ్' అనే వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన తహశీల్దార్ పవర్ గ్రిడ్ కోసం భూ సేకరణ చేపట్టిన ఉన్నతాధికారులతో చర్చించి పున్ణపరిశీలన చేస్తామన్నారు. అంతేగాకుండా కిందిస్థాయి సిబ్బంది సమన్వయంతో రికార్డులు, బాధిత రైతుల ఆధారాలను పరిశీలించి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు.

## బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి

**బొమ్మనహాల్ :** బడిఈడు పిల్లలు బడిలో మాత్రమే ఉండాలని ఎంఇఒ మల్లికార్జున సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎలిమెంటరీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పనికి పోవాలని, పిల్లలు బడికి పోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డాక్టర్ రంగు సుధీంద్రకు టైమ్స్ నౌ అవార్డు

**అనంతపురం :** ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన ప్రముఖ ఛాతీ వైద్య నిపుణులు డాక్టర్ రంగు సుధీంద్రకు టైమ్స్ నౌ సంస్థ నుంచి అవార్డు లభించింది. ఈమేరకు జూన్ 29న టైమ్స్ గ్రూప్ సంస్థ న్యూ ఢిల్లీలోని తాజ్‌ప్యాలెస్‌లో అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆ రాష్ట్ర మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ హాజరవ్వగా డైరెక్ట్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ వందన బగ్గా అవార్డులు అందించారు. తనకు అవార్డు రావడం పట్ల డాక్టర్ సుధీంద్ర సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ వైద్యులు ప్రముఖులు పాల్గొన్నారు.




అవార్డు అందుకుంటున్న డాక్టర్ సుధీంద్ర

## పొలాలకు రస్తా ఏర్పాటు చేయాలని ధర్నా

**నార్పల :** పొలాలకు రస్తా ఏర్పాటు చేయాలని మండల పరిధిలోని శోదనపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వమించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యవసాయ పొలాలకు వెళ్లే దారిని గ్రామానికి చెందిన ఓ రైతు మూసివేశాడన్నారు. దీంతో పొలాలకు వెళ్లేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనరసింహులు ఈనెల 4వతేదీన గ్రామానికి వచ్చి పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరవించారు.

## వైద్యులకు సన్మానం

**గుత్తి :** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారులు సి.యల్లప్ప, ఎన్.తిరుపతినాయుడు, పి.మణిదీప్, ఎం.శాంతిప్రియను సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ ఎం.విరుపాక్షిరెడ్డి, జిలాన్‌ఖాన్, మక్బూల్, శ్రీనివాసులు, శివ, ప్రజాసైన్స్ వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.సురేష్ బాబు పాల్గొన్నారు.

**పామిడి :** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న మెడికల్ ఆఫీసర్ శివకార్తీక్‌రెడ్డిని మండల కేంద్రంలోని టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సిసి యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి రామాంజనేయులు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ పరిశీలన

**రాయదుర్గం :** పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎండియు వాహనాల ద్వారా చేపట్టిన నిత్యావసర సరుకుల పంపిణీ తీరును తహశీల్దార్ చిట్టిబాబు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన పద్ధతుల్లో నిత్యావసర సరుకులు తూకం వేయాలన్నారు. సకాలంలో సరుకులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని ఆదేశించారు.



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న తహశీల్దార్ చిట్టిబాబు

# నేరాలు ఘోరాలు

## పాముకాటుతో వ్యక్తి మృతి



సుబ్బయ్య (పాతచిత్రం)

**పుట్లూరు :** పాముకాటుతో వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు కడవకల్లు గ్రామానికి చెందిన సుబ్బయ్య (45) తెల్లవారుజామున గ్రామంలోనిని ఆలయం వద్ద పూజలు చేస్తుండగా పాముకాటు వేసింది. వెంటనే బంధువులు చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు.

## నగదు చోరీ

**రాయదుర్గం :** పట్టణంలోని జెఆర్‌ఎస్ కాలనీలో ఉన్న ఓ ఇంట్లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండుగులు బీగాలు బద్దలుకొట్టి ఇంట్లోని రూ.3.5 లక్షల నగదును చోరీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఇంటి యజమాని హుస్సేన్, కుటుంబ సభ్యులు ఇంటి పైఅంతస్తులో సోమవారం రాత్రి నిద్రిస్తుండగా తెల్లవారుజామున దొంగలు తలుపు తాళం తెరిచి వంట గదిలోని డబ్బాలో దాచి ఉంచిన రూ.3.5లక్షలతోపాటు కబోర్డులోని రోల్డ్ గోల్డ్ నగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. సిమెంటు ఇటుకలు తయారు చేయడంతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న హుస్సేన్ తనకు కోతిగుట్టలో ఉన్న ఒక ఇల్లు అమ్మకం ద్వారా వచ్చిన నగదు వంటగదిలో ఒకచోట, మరో డబ్బాలో కొంత నగదు ఉంచినట్లు తెలిపారు. ఒక డబ్బాలోని రూ.3.5లక్షలను దొంగలించినట్లు తెలిపారు. ఉదయం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేయగా ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.